అమ్మవార్లకు బోనమెత్తిన భక్తజనం




వెంకటగారిపల్లి, పోట్లమర్రిలో పూజలందుకుంటున్న సత్యమ్మ తల్లి, నలలమ్మ తల్లి



వెంకటగారిపల్లిలో బోనాలు తీసుకువచ్చిన గ్రామస్తులు

బత్తలపల్లి: మండలంలోని వెంకటగారిపల్లి, పోట్లమర్రి గ్రామాల్లో కొలువైన సత్యమ్మ, నలలమ్మ గ్రామ దేవతలకు గ్రామస్తులు గురువారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలను పూలు, ఆభరణాలతో అలంకరించారు. ప్రతి ఇంటి నుంచి కొత్త కుండలో చేసిన తీపి అన్నంను, నారికేళాలను, పూలను తీసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. ఉగాది పండుగ మరుసటి దినం సత్యమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆచారంగా కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు.

గ్రామ దేవతలకు విశేష పూజలు

బత్తలపల్లి: ఉగాది మరుసటి రోజు గ్రామదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతలకు ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. వెంకటగారిపల్లి, ఎం.చెర్లోపల్లి, పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, సంజీవపురం, యర్రాయపల్లి, జ్వాలాపురం, అప్పరాచెరువు, చెన్నరాయపట్నం, ఓబుళాపురం, పత్యాపురం, డి.చెర్లోపల్లి, నల్లబోయనపల్లి, ముద్దనపల్లి, కాటమకుంట, ఉప్పర్లపల్లి, దంపెట్ల గ్రామాలలోని గ్రామదేవతల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పంటలు పుష్కలంగా పండాలని దేవతలను వేడుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో టెంకాయలు, చీనీపండ్లు విసురుతూ పందాలు ఆడారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని గురువారం వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ తాడిమర్రి సుబ్బారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ పెద్దల సమక్షంలో వేద పండితులు మామిళ్లపల్లి సంతోష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిహోత్ర హోమం, మహాగణపతి పూజ, జలాభిషేకం, కుంకుమాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాలు జపిస్తుండగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఉప సర్పంచ్ తాడిమర్రి రమణారెడ్డి, తాడిమర్రి మనోజ్ కుమార్‌రెడ్డి, తాడిమర్రి వెంకటరెడ్డి, తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, చిన్నగంగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి ఊరేగింపు



అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

అమడగూరు: మండలంలో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీ అమ్మవారి ఊరేగింపు ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఊరేగింపులో భాగంగా తొలుత కొత్తపల్లిలో ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. డప్పు వాయిద్యాల మధ్య ప్రతి ఇంటివద్దకు విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లగా ప్రజలు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం తెల్లవారుజామున ముట్లవాండ్లపల్లికి విగ్రహాన్ని తీసుకెళ్తారు. నరసింహారెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు గ్రామాల్లో వైద్య సేవలు



వైద్య సేవలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పుల్లానారాయణపల్లి, తురకవారిపల్లి గ్రామాల్లో గురువారం డాక్టర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేసి వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ రోగాలతో మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



నసనకోట సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

రామగిరి: నసనకోట, మాదాపురం సచివాలయాలను ఎంపీడీఓ ఆజాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను అర్హులకందరికీ అందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. రోజూ సిబ్బంది వేళకు విధులకు హాజరుకావాలని,వలంటీర్లు ప్రతి ఇల్లూ తిరిగి, అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు సచివాలయ వలంటీరు పోస్టులకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్, ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. దంపెట్లలో రెండు పోస్టులను బీసీ జనరల్, నల్లబోయనపల్లిలో రెండు పోస్టులను ఓసీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో, లేదా సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

తలుపుల: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు ఈనెల 27వ తేదీలోగా ఎంపీడీఓ కార్యాయలంలో గానీ, ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామానాయక్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. తలుపుల-2, ఉడుములకుర్తి-1, బత్రేపల్లి-1, వేపమానిపేట-1, బండ్లపల్లిలో ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న విశ్వనాథరెడ్డి

అమడగూరు: ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని టీ పుట్లవాండ్లపల్లికి చెందిన దేవిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి కుటుంబానికి సన్‌యుగ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండీ, కంచరోళ్లపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి అండగా నిలిచారు. మృతుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని కుమారుని విద్యకు అన్నివిధాలుగా సాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

ధర్మవరం: దేశ స్వాతంత్య్రం కోసం ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ కెరటాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అడుగుజాడల్లో నడవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం భగత్‌సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతలయ్య మాట్లాడుతూ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు స్ఫూర్తితో అంతరాలు, అసమానతలు లేని సమాజం కోసం పోరాటం చేయాలని సూచించారు.

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం



కనగానపల్లిలో భూసర్వే నిర్వహిస్తున్న అధికారులు

కనగానపల్లి: సుమారు వందేళ్ల తర్వాత ప్రభుత్వం చేపట్టిన సమగ్రసర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ పీవీ రమణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో భూ సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలోని కనగానపల్లి, రాంపురం, కోనాపురం గ్రామాల్లో రెవెన్యూ, సర్వే సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి, సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సర్వే పారదర్శకంగా నిర్వహించి రైతుల భూ సమస్యలను తక్షణ పరిష్కారం చూపాలని ఆయన సర్వే సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ రికార్డులు, సర్వే మ్యాపులు ప్రకారం సర్వే రాళ్లను గుర్తించి కొలతలు వేస్తున్నట్లు మండల సర్వేయర్ స్టీఫెన్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మారుతీప్రసాద్, సర్వే సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాపన్న, అంకే రామకృష్ణ, చింతమేకల రవి, అక్కులప్ప, రైతులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

కదిరి అర్బన్: ఆకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం ముందు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశామన్నారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారని పేర్కొన్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని ఏఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రేపు వారపు సంత వేలం

చిలమత్తూరు: మండల కేంద్రంలో నిర్వహించే వారపు సంతకు ఈనెల 25న వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సర్పంచ్ అధ్యక్షతన బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. అదే విధంగా బస్టాండ్‌కు రూ.50 వేలు, జంతువధశాలకు రూ.3 వేలు, షాపింగ్ కాంప్లెక్స్ రూములు జనరల్‌కు రూ.50 వేలు, షెడ్యూల్ తెగల వారు రూ.10 వేల దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొలన్నారు.

రోడ్డు నిర్మాణంతో నెరవేరిన గ్రామీణుల కల



బొగ్గిటివారిపల్లికి నిర్మించిన తారురోడ్డు

నల్లమాడ: పులగంపల్లి పంచాయతీలోని కాయలవాండ్లపల్లి, బొగ్గిటివారిపల్లి గ్రామాలకు తారు రోడ్డు అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కల సాకారమైందని సంబరపడుతున్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవ తీసుకొని ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నుంచి రూ.1.68 కోట్ల నిధులు తెప్పించి ఆయా గ్రామాలకు తారురోడ్డు నిర్మించారు. ఆ రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు కాలిబాటే శరణ్యంగా ఉండేది. కాయలవాండ్లపల్లిలో 55 కుటుంబాలుండగా 200పైగా జనాభా ఉంది. బొగ్గిటివారిపల్లిలో 40 కుటుంబాలకు గాను 200 లోపు జనాభా ఉంది. వర్షాకాలం వస్తే ఆటోలు,108 కూడా వెళ్లలేని పరిస్థితి. టీడీపీ హయాంలో రోడ్ల నిర్మాణానికి కేవలం శంకుస్థాపన చేసి వదిలేశారు. గ్రామీణుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే దుద్దుకుంట నిధులు మంజూరు చేయించారు. దీంతో కదిరి-హిందూపురం రహదారి నుంచి కాయలవాండ్లపల్లి, బొగ్గిటివారిపల్లికి రెండు కిలోమీటర్ల తారురోడ్డు నిర్మింపజేశారు. రెండు రోజుల క్రితం రోడ్డు పనులు పూర్తవ్వడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జోడుగూళ్ల గంగమ్మ తిరునాళ్లు



జోడుగూళ్ల గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు: మండల పరిధిలోని మార్పురివాండ్లపల్లిలో జోడుగూళ్ల గంగమ్మ తిరునాళ్లను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మ తల్లికి అర్చకులు పూజలు చేసిన అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరునాళ్లకు మండలం నుంచే కాకుండా అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, పీటీఎం, బీ.కొత్తకోటతో పాటు కర్ణాటకలోని చేళూరు నుండి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

హిందూపురం: పట్టణంలోని సూరప్పకట్ట వద్ద ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉగాది సందర్భంగా గురువారం సాయంత్రం అంబేడ్కర్ నగర్‌లో కొందరు యువకులు రంగులు చల్లుకున్నారు. కాలనీలో ఆడుకోండి రోడ్లపైకి ఇటుగా రావద్దని అక్కడి వారు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదికాస్తా ఘర్షణకు దారితీయడంతో రాళ్లు రువ్వుకున్నారు. హరిష్, చింటూ, మరొకరి తలకు గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు వారిని ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలను పోలీసు స్టేషన్‌కు పిలిచి విచారణ చేస్తున్నారు.

శ్రీరామనవమి వేడుకలకు ధాన్యం, బియ్యం సేకరణ



ధాన్యం, బియ్యం సేకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రాంనగర్‌లోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి రోజున శ్రీ సీతారాముల కల్యాణం, మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ధాన్యం సేకరణ చేపట్టింది. కమిటీ సభ్యులు గురువారం ఇంటింటికీ తిరిగి దాతల ద్వారా ధన, ధాన్యం, బియ్యం, బేడలు సేకరించారు. గౌరవాధ్యక్షులు పులిచెర్ల వేణుగోపాల్, గట్టు చౌడప్ప, పూజారి వెంకట్రాముడు, అధ్యక్షుడు సోమశేఖర్, ఉపాధ్యక్షులు బీరే లోకేష్, చందా రామంజినేయులు, ప్రధాన కార్యదర్శి రంగన వెంకటరమణ, సహాయ కార్యదర్శి పులిచెర్ల లక్ష్మయ్య, దాసరి హరి, కృష్ణ, పామిశెట్టి రాజశేఖర్, కోశాధికారి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా విధులు



బాలింతలతో వైద్య సేవలపై ఆరా తీస్తున్న వైద్యాధికారి కృష్ణయ్య

తలుపుల: మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణయ్య వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఐఎల్ఆర్ విభాగంలో చిన్న పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకా పంపిణీపై వైద్యాధికారి మున్వర్‌బాషాకు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలను కలిసి మాతా శిశు సంరక్షణ సేవలపై ఆరా తీశారు.

బుక్కపట్నంలో నారాయణ సేవ



భజన చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నంలో శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం సత్యసాయి నారాయణ సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి నామస్మరణ చేస్తూ భజన చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు దుర్గమ్మ ఉట్లపరుష

ధర్మవరం: పట్టణంలోని దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఉట్ల పరుష నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం ఏర్పాట్లు చేశారు. ఉట్లమాను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోయ నరసింహులు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఉట్ల పరుష ప్రారంభమవుతుందని తెలిపారు.



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని కాపుచెన్నంపల్లి సమీపంలోని పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4,500 నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చిరుధాన్యాల వినియోగంపై చైతన్యం తేవాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

పుట్టపర్తి అర్బన్: మనిషికి ఆరోగ్యాన్ని అందించే చిరుధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి వినియోగాన్ని పెంచాలని వైస్ ఎంపీపీ కేసీ రంగన్న, ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల సందర్భంగా నిడిమామిడిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు, ఊదలు, మినుములు, ఉలవల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, వాటితో జావ, కిచిడి, దోసెలు, ఇడ్లీలు, అన్నం, ముద్ద ఎన్నో రకాల ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చన్నారు. వీటి వినియోగంతో డయాబెటీస్, ఊబకాయం, రక్త హీనతను నివారించవచ్చన్నారు. చిరుధాన్యాల ప్రయోజనాలపై ప్రచారం చేయాలన్నారు. సూపర్‌వైజర్ నాగరాణి, నాయకులు బాలక్రిష్ణ, సెక్రెటరీ పుష్పా, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: కేజీబీవీలో 6, 11వ తరగతిలో ప్రవేశాలకు, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ నరసయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అనాథలు బడిబయట పిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేద, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2023-24లో ఇంటర్, 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ దుర్గా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. మండలంలోని అనాథలు, బీపీఎల్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పండ్లతోటల సాగుకు దరఖాస్తులు

తలుపుల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు మామిడి, చీనీ, నిమ్మ తదితర పంటల సాగు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ రామానాయక్ గురువారం తెలిపారు. అర్హులైన రైతులు ఈ నెలాఖరు లోగా ఆధార్, పట్టాదారు, జాబ్ కార్డు నకళ్లతో ఎంపీడీఓ కార్యాలయంలో అందజేసి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

25న పంచాయతీ గదుల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక గ్రామ పంచాయతీ గదులు ఈనెల 25న వేలం వేయనున్నట్లు ఎంపీడీఓ అశోక్‌నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులతో నిర్మించిన 16 రూములను ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఓటు వేసిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి

కదిరిటౌన్: అమరావతిలోని అసెంబ్లీ భవనంలో గురువారం జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ జాతర

నల్లచెరువు: మండలంలోని ఓరువాయి గ్రామంలో శ్రీ రేణుకాఎల్లమ్మ జాతరను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భూ సర్వే వేగవంతం చేయండి

ఓడీ చెరువు: ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి మండలంలో చేపట్టిన భూ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీధర్ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశమై మాట్లాడారు. కొండకమర్ల రెవెన్యూ పరిధిలో 80 మంది రైతులకు సంబంధించి 74 ఎకరాలు సేకరించనున్నారన్నారు. అర్హులైన రైతుల నుంచి క్లెయిమ్‌లను స్వీకరించి అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. భూ సర్వే డీటీ జాకీర్ హుస్సేన్, మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు నరసింహులు, శ్రీలత, నాగేశ్వరి, రమణ, రాజు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కొత్తచెరువు: మండల కేంద్రమైన కొత్తచెరువులోని పుట్టపర్తి రహదారిలో బైక్ చోరీకి గురైంది. పుట్టపర్తి రహదారిలో నివాసం ఉంటున్న గోపాల్ అనే వ్యక్తి సిమెంట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈయన తన బైక్‌ను ఇంటి ముందు నిలిపి ఉంచగా బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని చోరీ చేశారు. గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లింగన్న కేసు దర్యాప్తు చేపట్టారు.

టైర్ పేలి కారును ఢీకొన్న ట్రాక్టర్

టైరు పేలి అదుపు తప్పిన ట్రాక్టర్ కారును ఢీకొంది. వివరాలు.. మామిళ్లకుంట క్రాస్ నుంచి గురువారం ఉదయం ఎరువు లోడుతో వస్తున్న వెంకటాంపల్లికి చెందిన ట్రాక్టర్ కొత్తచెరువులోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోకి రాగానే టైరు పేలిపోయింది. దీంతో వాహనం అదుపు తప్పి అదే రోడ్డులో వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారు జోరు నుజ్జునుజ్జు అయ్యింది. అయితే ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

తాడిమర్రి: చిల్లవారిపల్లి గ్రామంలో కాటికోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఉగాది మరుసటి రోజు గ్రామంలో స్వామివార్లను వెండి ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ.